క్లుప్తంగా

టీజీసీటీఏ ఓయూ కార్యదర్శిగా రాకేష్ భవాని



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఉస్మానియా యూనివర్సిటీ సెక్రటరీగా కవి, రచయిత, గాయకులు డాక్టర్ చింతల రాకేష్ భవాని వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఇటీవల డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేంద్రకుమార్, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డాక్టర్ చింతల రాకేష్‌భవాని ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఇటీవల 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా పాత పెన్షన్ సాధనకు కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ భవాని మాట్లాడుతూ... ఈ ఎన్నిక తన బాధ్యతను మరింత పెంచిందని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ సత్యసాయి జిల్లా, కదిరి మండలం, చిగుమానూరు తండాకు చెందిన బాలే నాయక్ భార్య సాలేబాయి (48) నగరంలో భిక్షాటన చేసి జీవిస్తోంది. మంగళవారం రాత్రి ఆమె బర్కత్‌పురలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొని గాయపడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (55) ఉందానగర్ - జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్నూరుకాపు సంఘం కేలండర్ ఆవిష్కరణ



కాచిగూడ: మున్నూరుకాపు సంఘం కేలండర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరుకాపులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారంలో భాగస్వాములైనప్పుడే మున్నూరుకాపుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా మున్నూరుకాపులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు మున్నూరు కాపులు ముందుకు రావాలన్నారు.

మెల్కొటె పార్కులో వెటర్నరీ మెడికల్ షాపు వద్దు



కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మెల్కొటె వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాచిగూడ: మెల్కొటె పార్క్‌లో ఏర్పాటు చేయనున్న వెటర్నరీ మెడికల్ షాపును రద్దు చేయాలంటూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిమాయత్‌నగర్‌లోని మెల్కొటె పార్కులో వెటర్నరీ మెడికల్ షాపు ఏర్పాటుతో పార్క్‌కు వస్తున్న వాకర్స్‌కి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. కుక్కలు, ఇతర జంతువులను మెడికల్ షాపు వద్దకు తెచ్చినప్పుడు వాటి విసర్జక పదార్థాలు, అన్ కండిషనల్ బిహేవియర్‌తో వాకర్స్‌కు ప్రమాదం కలిగే అవకాశం ఉందన్నారు. తాము వాహనాలు నిలిపేందుకు సైతం ఆటంకం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. మెడికల్ షాపు ఏర్పాటు టెండర్‌ను దర్దు చేసి తమకు సహకరించాలంటూ కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

ప్రేమ, శాంతికి ప్రతీక ఏసు

– వైభవంగా క్రిస్మస్ పండుగ సంబురాలు.. కిటకిటలాడిన చర్చిలు.. ఎటు చూసినా సామూహిక ప్రార్థనలు

క్రిస్మస్ పర్వదినం అందరిలోనూ ప్రేమాభిమానాలు, సుఖ శాంతులను పెంచుతుందని పాస్టర్లు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ పరిధిలోని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏసు బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని అన్నారు. శాంతి, ప్రేమకు ఏసు ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా భక్తులు గీతాలను ఆలపించారు. క్రిస్మస్ వేడుకతో జోన్ పరిధిలో ఎక్కడ చూసిన పండుగ వాతావరణం సంతరించుకుంది. – ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అరికేఫ్ చౌరస్తాలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో డీపీ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మ, చర్చి ఫాదర్ సీఎస్ మూర్తి. ప్రార్థనలకు భారీగా హాజరైన క్రైస్తవులు



హెబ్రోన్ చర్చిలో ప్రసంగిస్తున్న కెప్టెన్ శ్యామ్యూల్, బ్రదర్ ఇజ్రాయెల్



హెబ్రోన్ చర్చిలో ప్రార్థనలకు వస్తున్న క్రైస్తవులు



నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న భక్తులు





కుత్బిగూడలోని సెయింట్ థామస్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు



కెన్నడీ రాజు నిర్వహించిన వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అరవింద్‌యాదవ్



కాంగ్రెస్ నేత కన్నా డేనియల్ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు



లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్, ఆప్ నేతలు

భక్తిశ్రద్ధలతో 'కుసుమహరుల వ్రతకల్పం'



కుసుమహరుల వ్రతకల్పంలో పాల్గొన్న భక్తులు



వ్రతకల్పం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నల్లకుంట: కుసుమహర ఫౌండేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట టీఆర్టీ కాలనీలోని శ్రీ కుసుమహరనాథ ఆశ్రమంలో 'కుసుమహరుల వ్రతకల్పం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని రాధాకృష్ణులు, కుసుమహరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుసుమహరుల వ్రతకల్పం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కుసుమహరుల వ్రతకల్పం పుస్తకాన్ని ఆవిష్కరించి భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం నిర్వహించిన నామ సంకీర్తనలో పాల్గొన్న చిన్నారులు రాగయుక్తంగా కీర్తనలు గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. చివరగా మాతృమూర్తుల జ్ఞాపికల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కుసుమహరుల ఫౌండేషన్ హైదరాబాద్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణకు ప్రత్యేక స్థానం

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో బుధవారం ఉన్నవ లక్ష్మీనారాయణ సంస్మరణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ రచయిత నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ... తెలుగు నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన రచయితగానే కాకుండా గాంధీజీ పిలుపును అందుకొని దళిత దీన జనోద్ధరణకు కార్యాచరణ చేపట్టిన మహనీయులని కొనియాడారు. వందేళ్ల క్రితమే మాలపల్లి నవల రాసి సమాజంలోని రుగ్మతలను ఎండగట్టిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సభ గానసభ అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధనామూర్తి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ కవుల సంఘం అధ్యక్షుడు సుతారపు వెంకటనారాయణ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్‌బీ రామ్, వ్యాసకర్త మిద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప



మహా పడిపూజలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, సలంద్రి శ్రీనివాస్

కవాడిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం దోమలగూడ గగన్‌మహల్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ జరిగింది. ఈ మహా పడిపూజకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ నేతలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా ప్రశాంత్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. పూజ అనంతరం అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో స్వాములు సలంద్రి సాయితేజ, లక్ష్మణ్ గురుస్వామి, రాజు గురుస్వామి, నాయకులు రమేష్‌రాం, వెంకటేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి

- కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి
- ఘనంగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు



కాచిగూడలో జరిగిన వాజ్‌పేయి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం దేశానికే ఆదర్శమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి ఆధ్వర్యంలో బుధవారం అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హాజరై మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్ఎంసీ స్వీపర్స్‌ను సత్కరించి వారికి పండ్లు, బట్టలు పంపిణీ చేశారు.

❖ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నవయుగ హృదయ సామ్రాట్‌గా వాజ్‌పేయి పేరు తెచ్చుకున్నారని అన్నారు. వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా వాజ్‌పేయి ఉపన్యాసం వినేందుకు దేశ నలుమూలల నుంచి వచ్చేవారని ఆయన గుర్తు చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలను ఏ విధంగా నడిపించాలో మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి నిరూపించారన్నారు. వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, చింతల రాంచంద్రారెడ్డి, డాక్టర్ సమత, డాక్టర్ ఎస్.గౌతంరావు, కన్నె రమేష్ యాదవ్, సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, సి.వినోద్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్‌లో రోగులకు పండ్ల పంపిణీ..

నల్లకుంట: బీజేపీ సెంట్రల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంటలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఫీవర్ ఆస్పత్రిలో చేపట్టిన పండ్ల పంపిణీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరై రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, ప్రచార కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, ఎస్సీ మోర్చా సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిశోర్ కుమార్, సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజీ.బాబు, గీతా మోర్చా కెప్టెన్ కృష్ణాగౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ గుండు వద్ద...

ముషీరాబాద్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు రాంనగర్ గుండు వద్ద ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై వాజ్‌పేయి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇటీవల పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన 30మంది బూత్ అధ్యక్షులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌కుమార్, పూస రాజు, ఆర్.శేషసాయి, సాయి కృష్ణయాదవ్, రమేష్‌రాం, ఎంసీ మోహన్, గౌరీశంకర్, వంశీకృష్ణ, మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రాం, ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, సాయికృష్ణాయాదవ్, అరుణ్, వెంకటేష్ తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

దుప్పట్ల పంపిణీ...

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకొని బుధవారం బాగ్‌లింగంపల్లిలో బీజేపీ కార్యాలయం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి కె. ఉపెందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి, ఎస్.శ్రీనివాస్, ఉమేష్, నర్సింహరాజు, జక్కా శ్రీను, వీరయ్య, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ జీ.. శత జయంతి ఉత్సవ ర్యాలీ

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాళులర్పించారు. అనంతరం బీజేపీ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. – కవాడిగూడ





రాంనగర్ గుండు వద్ద నేతలతో కలిసి నివాళి అర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



ఇందిరాపార్కు చౌరస్తాలో కార్పొరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం



రాంనగర్ చౌరస్తాలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



బాగ్‌లింగంపల్లిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవిచారి



ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డా. గౌతంరావు